సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం, 27, జనవరి, 2025

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. తెల్లవారుజామున మంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది.



ప్రగతి మైదానంలో కళాప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ప్రజావాణికి సకాలంలో హాజరవ్వాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని కోరారు.

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా విద్యాచందన


విద్యాచందన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీల పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో రెండు మున్సిపాలిటీలకూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నుంచి ఈ రెండు మున్సిపాలిటీల్లోనూ స్పెషలాఫీసర్ పాలన కొనసాగనుంది.

ప్రగతి దిశగా పయనం

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఆయిల్‌పామ్, కోకో సాగులో రాష్ట్రంలోనే ప్రథమస్థానం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి
- ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి గౌరవ వందనం స్వీకరణ




జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి దిశగా పయనిస్తోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. మొదట కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. దేశభక్తుల ఆశయాలు, త్యాగాల స్ఫూర్తితో పాటు సంస్కృతి, సంప్రదాయాలతో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నామని అన్నారు. పేదలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16 నుంచి 20 వరకు రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించినట్లు చెప్పారు. 21 నుంచి 24 వరకు అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో గ్రామ సభలు నిర్వహించామని, అర్హత ఉండీ జాబితాలో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించామని వివరించారు.

1.83 కోట్ల మంది ఉచిత ప్రయాణం..

జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు 1.83 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని కలెక్టర్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో 5,997 మంది వైద్యసేవలు పొందగా రూ.13.70కోట్లు ఖర్చయ్యాయని, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా 1,16,256 మందికి పరీక్షలు నిర్వహించామని అన్నారు. జిల్లాలో 3,896 హెల్త్ క్యాంపులు నిర్వహించి 1,53,824 మందికి వైద్యసేవలు అందించామని చెప్పారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 26,016 మందిని పరీక్షించినట్లు తెలిపారు. 61,790 మంది రైతులకు రూ. 437.94 కోట్ల రుణమాఫీ చేశామని, 1,08,223 మందికి రైతు బీమా ప్రీమియం చెల్లించామని చెప్పారు. 23 రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆధునిక పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఆయిల్‌పామ్, కోకో సాగు విస్తీర్ణంలో జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు.

సాగుకు నిరంతర విద్యుత్

జిల్లాలో వ్యవసాయంతో పాటు మిగితా రంగాలకు 24 గంటలూ నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గృహాల్లో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే 1,70,635 మందికి ఉచితంగా సరఫరా చేస్తున్నామని, 250 లోపు యూనిట్లు ఉపయోగించిన 751 మంది నాయీబ్రాహ్మణులకు, లాండరీ, ధోబీ ఘాట్‌లకు చెందిన 2,218 మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన 1,47,161 మంది లబ్ధిదారులకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. జిల్లాలో సన్నరకం ధాన్యం 91,670 టన్నులకు రూ.14.18 కోట్ల బోనస్ చెల్లించినట్లు వివరించారు. 2,060 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార పథకం కింద 31,268 మంది పిల్లలకు బాలామృతం, ప్రీ స్కూల్ విద్య అందిస్తున్నామని తెలిపారు. 6,092 మంది గర్భిణులకు, 6,989 మంది బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 860 పాఠశాలల్లో రూ 25.38 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామని, 165 ప్రాథమిక పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి పిల్లల్లో పుస్తకపఠనం పట్ల ఆసక్తి కల్పిస్తున్నామని తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో పాటు పరిశ్రమలు, డీఆర్డీఏ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం కలెక్టరేట్, క్యాంపు కార్యాలయాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు డీఎఫ్ఓ కృష్ణగౌడ్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..


జాతీయ జెండాకు వందనం చేస్తున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్ : జిల్లా కోర్టు ఆవరణలో జడ్జి పాటిల్ వసంత్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎ.సుచరిత, పి.వి.డి. లక్ష్మి, లక్కినేని సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు, ఎం.ఎస్ ఆర్. రవిచంద్రన్, సాధిక్‌పాషా పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, మల్లయ్యస్వామి, సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస్, కార్యాలయ ఏఓ మంజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో..

భద్రాచలం : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఓ బి.రాహుల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీలో ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలతో జీవిస్తున్న గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందని తెలిపారు. విద్యా, వైద్య రంగాల్లో గిరిజనులకు ఉత్తమ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఉట్నూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో భద్రాచలం ఐటీడీఏ జోన్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిందన్నారు. అటవీ హక్కుల చట్టం కింద హక్కు పత్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పలువురు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న పీఓ రాహుల్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే కోరం


కోయగూడెంలో లబ్ధిదారులకు పత్రం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

టేకులపల్లి : ప్రభుత్వం అందిస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని కోయగూడెంలో ఆదివారం వారు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులందరికీ ఈ పథకాలు అందుతాయన్నారు. తొలి విడతలో రాలేదని ఎవరూ నిరాశ చెందవద్దని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు రాత్రీ పగలు తేడా లేకుండా సర్వే చేసిన పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ, తహసీల్దార్లతో పాటు పలువురు అధికారుల సేవలు అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీరామ్, ఎంపీడీఓ రవీంద్రరావు, తహసీల్దార్ నాగభవాని తదితరులు పాల్గొన్నారు.

పూబెల్లిలో..

ఇల్లెందురూరల్: ప్రజల ఆకాంక్షలను నెరవర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పూబెల్లిలో నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో 90 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 45 మందికి రేషన్‌కార్డులు, 9 మందికి ఆత్మీయ భరోసా, 344 మందికి రైతు భరోసా పథకాల మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏడీఏ లాల్‌చంద్, మండల ప్రత్యేకాధికారి విజయ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికీ లబ్ధి


భద్రాచలంలో లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, పీఓ

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకురుతుందని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి, దుమ్ముగూడెం మండలం పెద్దకమలాపురంలో అధికారులతో కలిసి ఆదివారం ఆయన అర్హులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, దుమ్ముగూడెం మండల ప్రత్యేకాధికారి హరిలాల్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీఓ రామకృష్ణ, వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

అశ్వారావుపేటరూరల్/చంద్రుగొండ/ములకలపల్లి/దమ్మపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం ఆయన అశ్వారావుపేట మండలం పాత రెడ్డిగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం జానకీపురంలో ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి, చంద్రుగొండ మండలం బెండాలపాడులో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ములకలపల్లి మండలం చాపరాలపల్లి, దమ్మపేట మండలం మొండివర్రె గ్రామాల్లో స్థానిక అధికారులతో కలిసి నాలుగు సంక్షేమ పథకాల మంజూరుపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలిజాబితా పేరు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, ఈ పథకాలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. అర్హులైన వారికి అన్యాయం జరిగితే అధికారులను కాదు.. తనను నిలదీయాలని అన్నారు. అధికారులు కూడా పారదర్శకంగా పనిచేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారులు ప్రదీప్ కుమార్, సంజీవరావు, తహసీల్దార్లు కృష్ణ ప్రసాద్, జగదీశ్వర్ ప్రసాద్, సంధ్యారాణి, గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓలు మహాలక్ష్మి, బయ్యారపు అశోక్, రేవతి, ఎంపీడీవో రవీంద్రరెడ్డి, ఏపీఓ రామచంద్రరావు, ఎంపీఓ లక్ష్మయ్య, ఏఓలు శివరాంప్రసాద్, అరుణ్‌బాబు, చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, సొసైటీ డెరెక్టర్ అనుమల సత్యనారాయణ, దమ్మపేట డిప్యూటీ తహసీల్దార్ వాణి పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి మండలం జానకీపురంలో ఎస్పీతో కలిసి మంజూరుపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే జారే

అర్హులందరికీ పథకాలు


అశ్వాపురం మండలం తుమ్మలచెరువులో పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం, అదనపు కలెక్టర్

మణుగూరు టౌన్/పినపాక/అశ్వాపురం/కరకగూడెం : కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం లంక మల్లారం, పినపాక మండలం భూపాలపట్నం, అశ్వాపురం మండలం తుమ్మలచెరువు, కరకగూడెం మండలం రేగళ్లలో ఆదివారం ఆయన నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకులు రేషన్ కార్డు అనే పదాన్ని మరిచి ఏళ్ల తరబడి ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిప్పారని, తమ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే సుమారు 60 శాతం మందికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీఓ దామోదర్ రావు, పినపాక మండల ప్రత్యేక అధికారి తాతారావు, తహసీల్దార్లు రాఘవరెడ్డి, నరేష్, స్వర్ణలత, నాగ ప్రసాద్, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రామకృష్ణ, వరప్రసాద్, కుమార్, ఎంపీఓలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

స్వామివారికి విశ్వరూప సేవ నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు



వైకుంఠ రాముడి ‘విశ్వరూపం’

- రామయ్యకు వైభవంగా మహాదర్బార్ సేవ
- సర్వదేవతాలంకరణ దర్శనానికి భక్తుల నీరాజనం

భద్రాచలం : ధూప, దీప నైవేద్యాల నడుమ.. చుట్టూ 108 మంది అర్చనా మూర్తులతో భద్రగిరిపై కొలువుదీరిన వైకుంఠ రాముడి విశ్వరూప సేవ కనువిందు చేసింది. జగాలను ఏలే జగదభిరాముడికి జరిగిన మహా దర్బార్ భక్తులను సమ్మోహనులను చేసింది. గరుత్మంత వాహనంపై రాజాధిరాజుగా కనిపించిన రామయ్య దర్శనంతో భద్రగిరి పులకించింది. భద్రాచలంలో మాత్రమే ప్రత్యేకమైన విశ్వరూప సేవను భక్తులు వీక్షించి తరించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం ఈ వేడుకను వేద పండితులు, అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు.

విశ్వరూప సేవ విశిష్టత ఇలా..

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిసిన తరువాత వచ్చే బహుళ ద్వాదశి రోజున ఈ వేడుకను నిర్వహించడం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆనవాయితీ. సంవత్సర కాల పూజల్లో దొర్లే దోషాల నుంచి ప్రాయశ్చిత్తం కోసం శ్రీ సీతారామలక్ష్మణులతో పాటు ఆలయం ప్రాంగణంలోని ఉపాలయాల్లో ఉండే 108 మంది అర్చనా మూర్తులను ఒకేచోట వేంచేపు చేసి ఏకకాలంలో సేవ నిర్వహించటం ఈ వేడుక విశిష్టత. ముక్కోటి ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకోలేని భక్తులు ముక్కోటి దేవతలు కొలువై ఉన్న విశ్వరూప సేవ నాడు దర్శించుకుంటే ఆనాటి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం.

బేడామండపంలో ప్రత్యేక పూజలు..

తొలుత స్వామివారి ఉత్సవమూర్తులను గర్భగుడి నుంచి మంగళవాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. సువర్ణ పుష్ప పూజ, వేద విన్నపాలు, దండ దీపాంజలి, హారతి, అష్టోత్తర శతనామార్చన చేశారు. ఆ తర్వాత స్వామి వారికి ప్రత్యేక కదంబ ప్రసాదం నివేదించారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సర్వ బాధలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.

కీర్తనలు, రామనామస్మరణలతో..

విశ్వరూప సేవను పురస్కరించుకుని బేడా మండపాన్ని విద్యుత్ దీపాలు, రంగు రంగుల షామియానాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానాచార్యులు కేఈ స్థలశాయి రామకీర్తనలు ఆలపించారు. విశ్వరూప సేవ అనంతరం ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు గర్భగుడిలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ప్రధానార్చకులు విజయరాఘవన్, కోటి రామస్వరూప్, ఈఈ రవీందర్, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో నాణ్యత పాటించాలి

- త్వరలోనే ఒకటి, రెండు గనులు పూర్తిగా మహిళలకు కేటాయింపు
- సంస్థ మరో వందేళ్లు నడవాలంటే ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి

గణతంత్ర వేడుకల్లో సింగరేణి సీఎండీ బలరామ్


జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తున్న సీఎండీ బలరామ్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యంగా ఉండేలా జనరల్ మజ్దూర్ నుంచి జీఎం వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సీఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సింగరేణిలో ఉత్పత్తయ్యే బొగ్గుతో తెలంగాణతో పాటు మరో ఏడు రాష్ట్రాల్లో విద్యుత్ తయారవుతోందని చెప్పారు. కంపెనీ విస్తరణ దృష్ట్యా ఇప్పటికే మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో ఓబీ డంప్‌లపై 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని వివరించారు. సింగరేణి వ్యాప్తంగా మరో 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు మల్లన్న సాగర్, ఎల్‌ఎండీ తదితర జలాశయాల్లో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల్లో 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆవరణలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్, జెన్‌కో ఆధ్వర్యంలో రామగుండం బీ పవర్ హౌస్ ప్రాంతంలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.


ప్రగతి వనంలో ట్యాంక్ బండ్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

స్వీయరక్షణతోనే ప్రమాదాల నివారణ..

బొగ్గు ఉత్పత్తి చేసే క్రమంలో కార్మికులు, అధికారులు స్వీయ రక్షణ పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చని సీఎండీ పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక భద్రత దృష్ట్యా ప్రతీ ఉద్యోగికి బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం సింగరేణి యంత్రాల వినియోగం రోజుకు 11 – 14 గంటలు కాగా, ప్రైవేట్ యంత్రాలు 22 గంటల మేర నడుస్తున్నాయని, సంస్థ యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించడంపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. సంస్థ మరో వందేళ్ల మనుగడ సాగించాలంటే ప్రతీ ఒక్కరు రోజుకు 8 గంటలు పనిచేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులు, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వరరెడ్డి, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతివనంలో ఎకో పార్క్ ప్రారంభం

రుద్రంపూర్‌లోని ప్రగతివనంలో రూ.2కోట్ల వ్యయంతో ఆధునికీకరించిన ఎకో పార్క్, ట్యాంక్‌బండ్‌ను, ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో కెఫేటేరియా గృహాన్ని, కల్యాణ వనాన్ని సీఎండీ ఎన్.బలరామ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంత వాసుల ఆరోగ్య పరిరక్షణకు ప్రగతి వనాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమని అన్నారు. గనుల్లో కష్టపడిన కార్మికులు సేద తీరేందుకు, పార్క్‌లో ఓపెన్ జిమ్, యోగా చేసుకునేందుకు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్మికుల పిల్లల కోసం జయశంకర్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడం ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో జీఎం శాలేంరాజు, ఎస్‌ఓటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, డీజీఎంలు కేశవరావు, యోహాన్ పాల్గొన్నారు.

అధికారులకు ప్రశంసా పత్రాలు



అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు ప్రశంసా పత్రం ఇస్తున్న కలెక్టర్ జితేష్ పాటిల్

విధి నిర్వహణలో అంకితభావంతోపాటు జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి కృషి చేసిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రగతిమైదానంలో ఆదివారం జరిగిన వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా అటవీశాఖాధికారి కృష్ణగౌడ్ ఉత్తమ ఉద్యోగులకు పత్రాలు అందించి అభినందించారు. – సూపర్‌బజార్(కొత్తగూడెం)



రాజుసుహాస్ ఇరిగేషన్ ఏఈఈ | శ్రీనివాసరెడ్డి ఇరిగేషన్ సీఈ | అర్జున్ ఇరిగేషన్ ఈఈ | కరుణాకర్‌రెడ్డి ఎంపీడీఓ | సత్తిబాబు కలెక్టర్ దఫేదార్ | వెంకటేశ్వర్లు రెవెన్యూ ఉద్యోగి | ఫణికుమార్ డీపీఆర్వో ఉద్యోగి | రాము డీపీఆర్వో ఉద్యోగి | క్రాంతి కానిస్టేబుల్ | ప్రవీణ్ కానిస్టేబుల్ | మనోహర్ ఎంవీఐ | వెంకటరమణ ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ | లక్ష్మయ్య డీఈఓ, డీవైఎస్‌ఓ | తిరుమలరావు రికార్డు అసిస్టెంట్ | పరంధామరెడ్డి డీవైఎస్‌ఓ



రామ్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ | మనోహర్, జిల్లా తూనికల, కొలతల అధికారి | నాగలక్ష్మి జెడ్పీ సీఈఓ | సుశీల్ ఎల్‌ఐసీ డీఐజీ | చెన్నారావు కలెక్టర్ గన్‌మెన్ | అశోక్, కలెక్టర్ పేషీ సీసీ | అరుణ, డీఎస్‌ఓ ఆఫీస్ | చంద్రమౌళి డీపీఓ | సంపత్ కలెక్టర్ సీసీ | గణేష్ కలెక్టర్ సీసీ | కిషోర్ కలెక్టర్ డ్రైవర్ | ప్రకాష్ డ్రైవర్ | పృథ్వీ, జిల్లా పరిశ్రమల మేనేజర్ | వెంకటేశ్వర్లు ఆర్‌అండ్‌బీ ఈఈ | వెంకటేశ్వర్లు ఎస్‌టీఓ



విద్యాచందన అదనపు కలెక్టర్ | స్వర్ణలత లెనినా డీడబ్ల్యూఓ | భాస్కర్‌నాయక్ డీఎంహెచ్‌ఓ | రవినాయక్ డీసీహెచ్‌ఎస్ | శేషాంజన్‌స్వామి గూడెం కమిషనర్ | అజ్గర్ హుస్సేన్ ఏపీఆర్వో | పురంధర్ పశుసంవర్థక అధికారి | ఇందిర, బీసీ సంక్షేమాధికారి | సంజీవరావు మైనార్టీ సంక్షేమాధికారి | రుక్మిణీదేవి డీఎస్‌ఓ | సైదులు, విద్యా శాఖ కోఆర్డినేటర్ | దామోదర్‌రావు ఆర్డీఓ, భద్రాచలం | మధు, ఆర్డీఓ కొత్తగూడెం | జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ | వెంకటేశ్వరాచారి డీఈఓ

క్లుప్తంగా

యథేచ్ఛగా చికెన్, మటన్ అమ్మకాలు

వ్యాపారులకు రూ.31 వేల జరిమానా



వ్యాపారికి జరిమానా రశీదు ఇస్తున్న కేఎంసీ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మటన్, చికెన్ షాపులు మూసివేయాలని, అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందుగానే హెచ్చరించారు. అయినా ఆదివారం కావడంతో వ్యాపారం కోల్పోవద్దని కొందరు వ్యాపారులు షాపులు తెరిచి బహిరంగంగానే అమ్మకాలు చేపట్టారు. దీంతో నగరవ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన కేఎంసీ ఉద్యోగులు షాపులు తెరిచిన వ్యాపారులకు జరిమానా విధించారు. ఈ మేరకు పలువురికి రూ.31 వేల జరిమానా విధించినట్లు శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు మల్లయ్య, వెంకటేశ్వర్లు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రంగులు, విద్యార్థినికి ల్యాప్‌టాప్

కల్లూరు: తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉషాసాధిక్‌అలీ ఆధ్వర్యాన మండలంలోని ఖాన్‌ఖాన్ ప్రాథమిక పాఠశాల భవనానికి రూ.65 వేలతో రంగులు వేయించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మేకల సమాఖ్యకు రూ.65 వేల విలువైన ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో దయాల్ కిశోర్‌దత్, సుజాత, ఉపాధ్యాయులు నిర్మల, లక్ష్మీప్రసన్నతో పాటు బంకా బాబు, సత్తెనపల్లి నర్సింహారావు, అన్నపూర్ణ, ఏసు, మౌర్య, మజ్హార్, అష్యా, జానీ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

తల్లాడ: తల్లాడలోని ఒకటో వార్డుకు తాగునీరు అందక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన ఆదివారం బోరు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, బోరు చెడిపోయినా మరమ్మతులు చేయించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ఈఓ కృష్ణారావుకు తెలిపినా పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈలప్రోలు నాగమణి, బొడ్డు జయ, సిరిగిరి నాగేశ్వరి, బీరెల్లి లక్ష్మి, అఖిల పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



వెంకన్న(ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం క్రాస్ సమీపాన టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. పెద తండా పరిధి ఇందిరమ్మకాలనీకి చెందిన పెంట్ర వెంకన్న (47) కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం మోపెడ్‌పై బైపాస్ మీదుగా వరంగల్ క్రాస్ రోడ్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొణిజర్ల: బోనకల్ బ్రాంచ్ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభించిందని ఎస్‌ఐ జి.సూరజ్ తెలిపారు. బీబీసీ లాక్‌లకు కి.మీ. దూరాన గుర్తు తెలియని పురుషుడి మృతదేహం ఉందనే సమాచారంతో పరిశీలించారు. మృతుడు నల్ల రంగు టీషర్టు ధరించి ఉండగా, మృతదేహం గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయిందని తెలిపారు. దీంతో అన్నం ఫౌండేషన్ వారి సహకారంతో మృతదేహాన్ని తీయించి ఖమ్మం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506









అలరించిన 'సాంస్కృతికం'

కొత్తగూడెం మున్సిపల్ ప్రగతి మైదానంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. దేశభక్తి గీతాలతోపాటు జానపద గీతాలకు చిన్నారులు నృత్యం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయగా, కలెక్టర్, ఎస్పీ తదితరులు పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు చిరు ధాన్యాల ఉపయోగంపై, వ్యవసాయశాఖ అధికారులు వివిధ పంటలు, నర్సరీలు, ఎరువులపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పలువురు ఆసక్తిగా తిలకించారు.

– కొత్తగూడెంటౌన్/ సూపర్‌బజార్ (కొత్తగూడెం)

కడదాకా సిద్ధాంతాన్ని వదలని అయిలయ్య



మాట్లాడుతున్న బి.వెంకట్, పక్కన జూలకంటి, నాయకులు

సంతాప సభలో సీపీఎం నేతలు



కాసాని మృతదేహం వద్ద తమ్మినేని

సుజాతనగర్: కడవరకు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వదలని కాసాని అయిలయ్య చరిత్రలో నిలిచిపోతారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు ఐలయ్య శనివారం మృతి చెందగా ఆదివారం ఆయన సంతాప సభ సుజాతనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాసాని మృతి ఈ ప్రాంత ప్రజలకే కాకుండా పార్టీకి తీరని లోటన్నారు. కన్నుమూశాక కూడా తన పార్థీవదేహం ఉపయోగపడాలని మెడికల్ కళాశాలకు ఇచ్చేలా ముందే నిర్ణయించిన ఆయనను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తదితరులు మాట్లాడగా.. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, రేగా కాంతారావు, వివిధ పార్టీల నాయకులు వనమా రాఘవేంద్రరావు, నాగా సీతారాములు, జేబీ.శౌరీ, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, సాబీర్‌పాషా తదితరులు కాసాని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం రాత్రి సుజాతనగర్‌లోని ఐలయ్య మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించి మాట్లాడారు.

స్వచ్ఛందంగా బంద్

సీపీఎం నేత కాసాని మృతికి సంతాపంగా సుజాతనగర్‌లో ఆదివారం స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వర్తక, వ్యాపార దుకాణాలను మూసివేశారు. అంతిమ యాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రారంభించిన ఎస్పీ



అర్హులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను చుంచుపల్లి మండలం పెనుబల్లిలో ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, అర్హత ఉండీ పథకాలు అందనివారు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. పథకాలు రాకపోతే నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ చలపతిరావు, డీఎస్పీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో తాత్కాలిక స్టూడెంట్ కౌన్సిలర్ (ఔట్ సోర్సింగ్) నియామకానికి సంబంధించిన మెరిట్ జాబితా విడుదల చేశామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 27, 28 తేదీల్లో అభ్యర్థులు స్వయంగా లేదా లిఖితపూర్వకంగా ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సరైన ఆధారాలున్న అభ్యంతరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. వాటిని పరిశీలించాక తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. వివరాలకు 9708178525 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. 698 మంది కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.24,200, 300 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.14,640 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

సైబర్ వలలో చిక్కి..

రూ.45 వేలు పోగొట్టుకున్న విద్యార్థి

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీకి చెందిన విద్యార్థి డి.ఆదర్శ్‌కు సోషల్ మీడియాలో ఓ వ్యక్తిపరిచయమయ్యాడు. తన యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం లభిస్తుందని నమ్మించి లింక్ పంపించాడు. లింక్‌ను ఓపెన్ చేశాక క్యూ ఆర్ కోడ్ పంపించాడు. ముందు రూ. 5 వేలు, తర్వాత రూ. 10 వేలు పంపించాలి సూచించగా ఆదర్శ్ నగదు బదిలీ చేశాడు. దీంతో సైబర్ నేరస్తుడు ఓ ఫేక్ బిల్లు పంపి, రూ. 1.75 వేలు మంజూరైనట్లు మెసేజ్ పంపాడు. నగదు అమెరికా కరెన్సీలో ఉంటుందని, మారకం కోసం రూ. 30 వేలు ఖర్చు అవుతుందని సూచించాడు. ఇలా రూ. 45 వేలు సైబర్ నేరగాని ఖాతాకు వెళ్లాయి. ఆ తర్వాత కూడా మరికొంత నగదు పంపించాలని కోరగా అనుమానం వచ్చిన ఆదర్శ్ పోలీసులను ఆశ్రయించాడు. బ్యాంక్‌లో సైతం ఫిర్యాదు చేయగా, నేరగాని ఖాతాలో రూ. 25 వేల జమ కాకుండా బ్యాంక్ అధికారులు నిలిపి వేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి సైబర్ విభాగానికి బదిలీ చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

బూర్గంపాడు: మండలంలోని సారపాక ప్రధాన కూడలిలో శనివారం రాత్రి మోటార్ సైకిల్‌ను లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ముత్యాలమ్మపేటకు చెందిన చంద్రారెడ్డి సారపాక ప్రధాన కూడలి నుంచి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భద్రాచలం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో చంద్రారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం కోసం ఖమ్మం తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీఆర్‌ఎస్ నేతపై కాంగ్రెస్ నాయకుల దాడి

పంచాయతీ కార్యాలయం ఎదుట గులాబీ శ్రేణుల ఆందోళన



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు మెడా మోహన్‌రావుపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు దాడి చేసి కొట్టారు. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం... ఆదివారం బెండాలపాడులో ప్రజాపాలన గ్రామసభ జరిగాక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అక్కడి నుంచి వెళ్లిపోయారు. పాఠశాల ప్రాంగణంలో సభ ముగిశాక ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు మెడా మోహన్‌రావు అక్కడకు చేరుకుని అనేక మంది అర్హుల పేర్లు జాబితాలో లేవని ప్రశ్నిస్తున్నాడు. ఈ క్రమంలో మా పంచాయతీలో నీకేం పనంటూ కాంగ్రెస్ నాయకుడు వాగ్వాదానికి దిగాడు. అనంతరం అక్కడికి చేరుకున్న మరికొందరు కాంగ్రెస్ నాయకులు మోహన్‌రావుపై పిడిగుద్దులతో దాడికి దిగారు. ఘర్షణను అడ్డుకోబోయిన జీసీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పాడెం రవి తలకు తీవ్ర గాయమైంది. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు అక్కడి చేరుకుని నిందితులను పట్టుకోవాలంటూ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. దీంతో ఎస్‌ఐ శివరామకృష్ణ పరిస్థితిని అదుపు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం.

నిందితులను శిక్షించాలి

బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడి చేసినవారిని శిక్షించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం చేతకాక కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుడిపై భౌతిక దాడిని తీవ్రంగా ఖండించారు. మోహన్‌రావును జిల్లా అధ్యక్షుడితోపాటు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఫోన్‌లో పరామర్శించారు.

'నవభారత్'లో దొంగల బీభత్సం

- కాలనీలో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలు
- రూ. కోటి విలువైన సొత్తు, బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు



క్వార్టర్ల పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ కాలనీలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని ఏకకాలంలో చోరీలకు పాల్పడ్డారు. నగదు, బంగారు ఆభరణాలతో మొత్తం రూ. కోటి విలువైన సొత్తు అపహరించినట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి దొంగల ముఠా నవభారత్ కాలనీలోకి ప్రవేశించింది. దొంగలు తాళాలను కట్టర్లతో కట్ చేసి, పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించారు. బీరువాలు పగులగొట్టి నగదు, బంగారు వస్తువులు చోరీ చేశారు. ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని తెల్లవారుజామున గమనించిన స్థానికులు కాలనీ సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించగా, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ సతీష్, పట్టణ ఎస్‌ఐ సుమన్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంజినీర్ ప్రతాప్ ఇంట్లో 50 తులాలు బంగారం చోరీ చేశారు. జూనియర్ ఆఫీసర్ గిరిధర్ బాబు ఇంట్లో రూ.3 లక్షల నగదు అపహరించారు. లాకర్ ఓపెన్ కాకపోవడంతో వదిలేశారు. అంజద్ పాషా ఇంట్లో 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు, విజయ ప్రకాష్ ఇంట్లో 40 తులాల బంగారం, రూ.5లక్షల నగదు, పార్వతి నాయక్ ఇంట్లో రెండు బంగారపు ఉంగరాలు, కొంత నగదు చోరీ చేశారు. ఎల్‌వీఎస్‌ఎన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు ఇళ్లలో కూడా చోరీకి యత్నించారు.

కట్టుదిట్టమైన భద్రత ఉన్నా..

కాలనీలో కట్టుదిట్టమైన భద్రత ఉన్నా అధికారులు ఉండే ఇళ్లనే దుండగులు టార్గెట్ చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలనీలో సెక్యూరిటీ గార్డులు కూడా ఉన్నారు. ఓ ఇంటి వద్ద సీసీ కెమెరా ఉండగా, పోలీసులు ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు అక్కడే ఉండి ఆధారాలు సేకరించారు. దొంగలు కాలనీలోకి ఎటువైపు నుంచి ప్రవేశించారు? చోరీ చేశాక ఎటు వైపు నుంచి పరారయ్యారు? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కాగా చోరీలపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని జగదాంబగుంపు గ్రామానికి చెందిన బండ హర్షవర్ధన్ పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆదివారం గణతంత్ర వేడుకలకు తాను చదివే పాఠశాలకు వెళ్లేసరికి ఆలస్యమవుతుందని భావించి స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జెండా వందనానికి సైకిల్‌పై బయలుదేరాడు. ఇల్లెందు–కొత్తగూడెం రహదారి దాటుతుండగా ఇల్లెందు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న బొగ్గు లారీ ఢీకొట్టింది. లారీ టైర్ల కింద ఇరుక్కుపోవడంతో స్థానికులు గమనించి బయటకు లాగారు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఇల్లెందు సీఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

సాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతి

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన ఇందూరి నాగాచారి (54) శనివారం బజారుకు వచ్చి కన్పించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐతే శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో నాగార్జున సాగర్ కెనాల్‌కు వెళ్లిన నాగాచారి చెప్పులు, సైకిల్ కాలువ కట్ట మీద ఆదివారం స్థానికులు గుర్తించారు. కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన నాగాచారి మృతదేహం ఎర్రబోయినపల్లి కాలువ సమీపంలో తేలింది. పోలీసులు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీసి పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బిల్లా వాసు(35) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అర్ధరాత్రి లారీని లక్ష్మీపురంలోని యార్డులో నిలిపి క్లీనర్ వెంకటేష్‌తో కలిసి నడుచుకుంటూ మోరంపల్లిబంజర వెళ్తున్నాడు. ఈ క్రమంలో వారి వెనుక నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఆ తర్వాత వాసును ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ వెంకటేశ్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.